శ్రీశ్రీశ్రీ సంజీవరాయస్వామి ఆలయం
సఖియా మఠం, బాయమ్మతోట, చిన బొందిలీపురం, శ్రీకాకుళం
ఆహ్వానం
తేది 31-08-2024 శనివారం
శనిత్రయోదశి
ఈ ఆలయంలో శనిత్రయోదశి సందర్భంగా ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించబడిన జిల్లాలోనే అరుదైన 3 అడుగులు ఎత్తుగల శ్రీశనైశ్వర విగ్రహానికి మీ స్వహస్తాలతో ద్వితీయ తైలాభిషేకం
(ఉదయం : 5 గం॥ల నుండి మధ్యాహ్నం 12 గం॥ల వరకు)
చేయుటకు తరలిరండి. దర్శించి తరించండి.
- ఆలయ ధర్మకర్త.
- విశ్వజయము గ్రూప్ భక్త బృందం సౌజన్యంతో
సెల్: 92466 31755

అడ్మిషన్లు జరుగుచున్నవి
రవాణా సదుపాయం కలదు
డాక్టర్ దండి సూర్యనారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి
శ్రీ శ్రద్ధ ప్లేస్కూల్
Right Place for Right Education
(LKG to 5th Class)
A/C
కామేశ్వరి కళ్యాణమండపం దగ్గర, నందల జంక్షన్, నక్కవీధి, కలెక్టర్ బంగ్లా రోడ్డు, శ్రీకాకుళం. 99893 03703

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 29-8-2024
సంపుటి: 20 సంచిక: 134
పేజీలు: 4 వెల: రూ.1

## ఆడించేది.. దాడులు చేసేది వారే!

- పేకాట దాడుల్లో పోలీసుల ద్విపాత్రాభినయం
- గెస్ట్‌హౌస్‌పై రెయిడ్‌లో కొత్త కోణాలు
- మంత్లీలు నిలిచిపోవడమే తాజా దాడికి కారణం
- ఎస్పీ ప్లాన్‌నే లీక్ చేసిన కొందరు పోలీసులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో అనేక పోలీస్‌స్టేషన్ల పరిధిలో పేకాడించేది, రైడ్ చేసేది పోలీసులే. ఎప్పట్నుంచో పోలీసులకు తెలిసే జిల్లాలో పేకాట దందా నడుస్తోంది. అయితే మంత్లీలు ఉండటంతో ఇంతవరకు ఎన్ని పత్రికల్లో కథనాలు వచ్చినా, ఎన్నిసార్లు పోలీస్ ఇంటెలిజెన్స్ వర్గాలు సమాచారమిచ్చినా స్పందించని సిబ్బంది ఇప్పుడు వరుస రైడ్‌ల వెనుక పక్కా వ్యూహం కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో, మరీ ముఖ్యంగా చివరి రెండున్నరేళ్ల కాలంలో నేరుగా పోలీసు ఉన్నతాధికారులకే సొమ్ములిచ్చి పేకాట శిబిరాలు నిర్వహించుకునేవారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్లకు అంతో ఇంతో మామూళ్లు ఇచ్చి నిరాటంకంగా పని కానిచ్చేసేవారు. అయితే ఇప్పుడు అటు రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఇక్కడ జిల్లాలో కూడా పోలీస్ బాస్ మారారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో స్టేషన్ల నుంచి సమాచారం అందిన చోట రైడ్ చేయాల్సి వస్తోంది. గత పోలీస్‌బాస్ వరకు స్టేషన్ ఫార్మాలిటీలు చూసిన పేకాట శిబిరాల నిర్వాహకులు ఇప్పుడు పెద్ద ఎత్తున బదిలీలు జరగడంతో ఎలా కలవాలి, ఎవరి ద్వారా కలవాలి అనేది తెలుసుకోలేక దొరికిపోయారు. అప్పటికీ స్టేషన్లలో కిందిస్థాయి సిబ్బంది ఉన్నతాధికారి ఆధ్వర్యంలో రైడ్ జరుగుతుందని తెలుసుకున్న వెంటనే శిబిరాల నిర్వాహకులకు సమాచారం ఇస్తున్నారు. అయితే మంగళవారం రాత్రి జరిగిన రైడ్‌లో కూడా లీకులు ఉన్నా తమనెవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో వీరు పోలీసులకు దొరికిపోయారు. వాస్తవానికి అక్కడ పేకాడుతున్న - మిగతా 4లో



## జగనన్న ఇళ్లు.. కష్టాల సవాళ్లు

'మేం కడుతున్నవి ఇళ్లు కాదు.. ఊళ్లు'.. అని గత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ సహా వైకాపా ప్రజాప్రతినిధులు, నేతలు ఆ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లూ ఊదరగొట్టారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడం, అక్కచెల్లెళ్ల కళ్లల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా గతంలో ఏ ప్రభుత్వంలోనూ జరగని విధంగా ఒకేసారి ముప్పై లక్షలకుపైగా ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని స్వయంగా వైఎస్ జగన్ సందర్భం వచ్చినప్పుడల్లా చెప్పుకొంటూ వచ్చారు. ఎన్నికల్లోనూ అదే ప్రచారాన్ని విస్తృతంగా చేశారు. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు వాటికి పూర్తి భిన్నంగా ఉన్నాయి. వైకాపా ప్రభుత్వం కట్టినవి ఊళ్లు కాదు.. సమస్యల లోగిళ్లు అని ఇళ్లు మంజూరైన లబ్ధిదారులే పెదవి విరిచారంటే జగనన్న కాలనీల పరిస్థితి ఏమిటో వేరే చెప్పాల్సిన అవసరం లేదు. సవాలక్ష సమస్యలతో ఇప్పటికీ చాలా కాలనీలు లబ్ధిదారులకు అందుబాటులోకి రాలేదు. తాగునీరు, కరెంటు, రోడ్లు, డ్రైనేజీ వంటి కనీస వసతులు కల్పించకపోవడం వల్ల వీటిలో చేరేందుకు లబ్ధిదారులు ముందుకు రావడంలేదు. ఫలితంగా సగానికిపైగా కాలనీలు నివాసయోగ్యంగా లేక ఖాళీగా ఉండిపోయాయి. ఊరికి దూరంగా కట్టిన ఈ ఇళ్లలో చేరేందుకు లబ్ధిదారులు విముఖత చూపుతుండటం కూడా ఈ దుస్థితికి మరో ముఖ్య కారణంగా కనిపిస్తోంది.



- జిల్లాలో 708 లే అవుట్లలో 33వేల ఇళ్ల నిర్మాణాలు
- వాటిలో సగానికిపైగా ఇప్పటికీ ఖాళీగా ఉన్న దుస్థితి
- కనీస సౌకర్యాలు సమకూర్చకపోవడమే కారణం
- ఊళ్లకు దూరంగా ఉండటంతో వాటిలో చేరేందుకు అనాసక్తి
- దళారుల ద్వారా ఇళ్లను అమ్మేసుకుంటున్నట్లు ఆరోపణలు

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

నవరత్నాలు పేరుతో అనేక సంక్షేమ పథకాలనే తన అజెండాగా ప్రకటించిన వైకాపా 2019 ఎన్నికల్లో అపూర్వ విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటినుంచీ నవరత్నాల స్కీములో పేర్కొన్న సంక్షేమ పథకాల అమలుకే ప్రాధాన్యమిచ్చింది. అందులో భాగంగా 'నవరత్నాలు-అందరికీ ఇళ్లు' పేరుతో వైఎస్‌ఆర్ జగనన్న ఇళ్ల పథకానికి 2021లో శ్రీకారం చుట్టింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షల మందికి ఇళ్ల నిర్మాణం చేపట్టింది. రెండు దశల్లో ప్రారంభించిన ఈ పథకంలో భాగంగా నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ఇళ్లులేని పేదల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. అర్హులైనవారిని గుర్తించి జాబితాలు రూపొందించారు. ఆ మేరకు ఎక్కడ ఎంత మందికి ఇళ్లు ఇవ్వాలో గుర్తించి ఆ మేరకు ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి లే అవుట్లు అభివృద్ధి చేశారు. పట్టణ, నగర ప్రాంతాల లబ్ధిదారులకు ఒకటింపావు సెంటు, గ్రామీణ లబ్ధిదారులకు సెంటు చొప్పున స్థలాలు కేటాయించి లే అవుట్లు వేశారు. ఒక్కో ఇంటికి ప్రభుత్వ సబ్సిడీ రూ.1.80 లక్షలు ఇవ్వగా, నిర్మాణానికి అయ్యే మిగతా మొత్తాన్ని బ్యాంకుల ద్వారా ప్రభుత్వమే రుణాలు ఇప్పించే ఏర్పాటు చేసింది. ఆ మేరకు కేటాయించిన ప్లాట్లలో లబ్ధిదారులను పెట్టి జియోట్యాగ్ కూడా చేయించి, దస్తావేజులు కూడా ఇచ్చారు. లబ్ధిదారుడి వెసులుబాటును బట్టి ప్రభుత్వమే నిర్మించిఇవ్వడం లేదా లబ్ధిదారులే సొంతంగా నిర్మించుకునే అవకాశంఇచ్చింది. ఆ మేరకు శ్రీకాకుళం జిల్లాలో 790 లే అవుట్లలో 33,285 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 708 లే అవుట్లలోనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. అయితే వీటిలోనూ చాలావరకు అసంపూర్తిగానే ఉన్నాయి. 8846 ఇళ్లు మాత్రమే ఇప్పటివరకు పూర్తి అయ్యాయని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

### కనీస సౌకర్యాలు మృగ్యం

జగనన్న కాలనీల్లో చాలావాటిలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైనా పూర్తి అయిన వాటి సంఖ్య చాలా తక్కువ. కాలనీల్లో ఇప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల లబ్ధిదారులు - మిగతా 4లో



అందరికీ ఆదివారం సెలవు. కానీ, ఆమెకు మాత్రం పనిదినం. ఎందుకంటే.. ఆడా, మగా, పిల్లా, పాప అంతా సెలవు దినాన ఇళ్లల్లో ఉంటారు గనుక. అంతేకాదు, ఉపాధిహామీ పథకం కింద పనిచేసే మహిళలకు కూడా ఆరోజు సెలవు కావడంతో వారినీ అక్షరాస్యులుగా చేసే ఓ సామాజిక బాధ్యతను ఆమె భుజాన వేసుకుంది. ఇంతకీ ఎవరి గురించి ఇదంతా అంటే..? రిటైర్డ్ ఏజ్‌లో అక్షరజ్ఞానాన్ని పెంచేందుకు బయల్దేరిన ఓ వాకింగ్ లైబ్రేరియన్ గురించి! ఆ నడిచే గ్రంథాలయం కథ తెలుసుకునేందుకు మనమూ ఓసారి కేరళ వరకూ వెళ్లొద్దాం పదండి!

## ఆదివారం.. ఆమెకు మాత్రం పనిదినం!

విశ్రాంతి అనే మాట ఎరుగకుండా పనిలోనే తృప్తిని వెతుక్కుంటున్నారు కేరళకు చెందిన రాధామణి. వాయినాడ్ ప్రతిభా పబ్లిక్ లైబ్రరీలో పనిచేసిన రాధామణి ఇప్పటికీ 69 ఏళ్ల వయస్సులోనూ వాకింగ్ లైబ్రేరియన్‌గా పనిచేస్తూనే ఉన్నారు. వాయిస్ ఆఫ్ రూరల్ ఇండియా పేరుతో ఆమె మళయాళంలో రాసిన తన లైఫ్ జర్నీ పుస్తకాన్ని గతంలో ఓ స్వచ్ఛంద సంస్థ ఆమె పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసింది.

మన ఆరోగ్యాలు మనం కాపాడుకోవడానికి వాకింగ్ బెటర్ అని డాక్టర్స్ చెప్పినా.. ఇంకెన్నింటికో సమయం దొరుకుతూ.. నడకకు మాత్రం సమయం దొరకడం లేదనే ఏవో కారణాలు వెతుక్కునే వారెందరో ఉన్న సమాజంలో.. రోజూ సామాజిక బాధ్యతను భుజానికెత్తుకుని.. దానికి తోడు ఓ పుస్తకాల సంచీనీ మోస్తూ రాధామణి బయల్దేరడం వాయినాడ్ చుట్టుపక్కల పల్లెల్లో కనిపిస్తుంది.

కోవిడ్ వంటి మహమ్మారి సమయంలో జగమంతా లాక్ డౌన్ అయి భయపడుతుంటే కూడా రాధామణి మాత్రం లైబ్రేరియన్‌గా తన పని ఆపలేదు. రాధామణి అలవాటు చేసిన పుస్తక పఠనంతో.. ఇళ్లను విడిచి బయటకు రాలేని నాటి సమాజం రాధామణిని సంప్రదించి వారాలకు సరిపడా పుస్తకాలు తీసుకెళ్లేవారు. అలా కోవిడ్ సమయంలోనే 102 మంది ఆమె పనిచేస్తున్న ప్రతిభా పబ్లిక్ లైబ్రరీలో కొత్తగా సభ్యత్వం తీసుకోగా.. అందులో 94 మంది మహిళలే కావడం మరో విశేషం.

ప్రారంభంలో సభ్యత్వం తీసుకున్న మహిళలు కూడా మంగళం, మనోరమ పత్రికలు మాత్రమే చదివేవారట. ఆ తర్వాత మెల్లిగా నవలలు, ట్రావెలాగ్స్ వంటివాటితో పాటు, ఎన్నో ఇతర అం శాల పట్ల కూడా అభిరుచినేర్పర్చుకున్నారంటుంది రాధామణి. ఆ తర్వాత తాను చదవనివాటి గురించి, తన సభ్యులెందరో చెప్పిన కొన్ని నవలలు, పుస్తకాల గురించి విని వాటిని చదవాలన్న ఆసక్తి తనకూ పెరిగిందంటారు రాధామణి.

అయితే, రాధామణి వాకింగ్ లైబ్రేరియన్‌గా మారడం వెనుక.. కేరళ స్టేట్ లైబ్రరీ కౌన్సిల్ చొరవ ఉంది. నిరక్షరాస్యులైన మహిళలతో పాటు ఎంతో కొంత చదువుకున్నవారికి ఇళ్లకే పుస్తకాలను తీసుకెళ్లాలన్న కౌన్సిల్ ఆలోచనను తన భుజానికెత్తుకుని కార్యరూపమిచ్చింది. దీన్ని కేరళలో వనితా వాయన పద్ధతి (ఉమెన్స్ రీడింగ్ ప్రాజెక్ట్)గా పిలుస్తారు. దాన్నే ఇప్పుడు వనితా వయోజక పుస్తక వితరణ పద్ధతి (బుక్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్ట్ ఫర్ ఉమన్ అండ్ ఎల్డియర్)గా పిలుస్తున్నారు.

2012 నుంచి రాధామణి వాకింగ్ లైబ్రేరియన్‌గా మారారు. అంతకుముందు పలు ఉద్యోగాలు చేసిన రాధామణి వాకింగ్ లైబ్రేరియన్‌గా మారాక తర్వాత మహిళా సమాజంతో కలిసేది. ముఖ్యంగా మహిళా సంఘాలతో భేటీ అయ్యేది. పుస్తక పఠనంపై అవగాహన కల్పించే స్థాయి నుంచి తానొక నడిచే గ్రంథాలయమై పుస్తక పఠనాన్ని అక్కడి సమాజంలో ఒక అలవాటుగా మార్చారామె. ఆ క్రమంలో రోజుకు కనీసం ఆరేడు కిలోమీటర్ల మేర ఆమె కాలినడకన ప్రయాణిస్తూ సమాజాన్ని చైతన్యపర్చేందుకు కంకణం కట్టుకోవడం ఆమె నిస్వార్థసేవకు నిదర్శనం.

చిన్నప్పట్నుంచీ పఠనాసక్తి ఉన్న రాధామణి.. తన తండ్రి ఒక రైతని, నిరక్షరాస్యుడని, వార్తాపత్రికలు తానే తండ్రికి చదివి వినిపించేదాన్నంటారు. అలాగే, నాన్న డిక్టేట్ చేస్తుంటే ఉత్తరాలు కూడా తానే రాసేదాన్నని, ఇంకా నాన్న నిద్రపోవడానికి కూడా చదువుతుండేదాన్నది చెబుతారు ఆ చదువరి. రాధామణి కుటుంబం అంతకుముందు కొట్టాయం జిల్లా వజూర్ అనే ఓ పట్ణంలో ఉండేది. ఆ తర్వాత వాయనాడుకు వలస వెళ్లారు. తల్లీ, తండ్రి రాధామణితో సహా మరో ముగ్గురు పిల్లు. అందరికీ వివాహాలైపోయాయి. 1977లో రాధామణి పెళ్లైంది. ఆ సమయంలో వాయినాడ్‌లో ప్రతిభా పబ్లిక్ లైబ్రరీని కొత్త భవనంలో ప్రారంభించారు. అదిగో అప్పుడు మొట్టమొదటిసారిగా తన చెల్లెలితో కలిసి ఆ గ్రంథాలయానికి వెళ్లింది రాధామణి. 1961 నుంచే ఉన్న ప్రతిభా పబ్లిక్ లైబ్రరీని నూతన భవనంలోకి మార్చకముందెప్పుడూ రాధామణి అక్కడి వెళ్లేది కాదు. అప్పుడామె ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసేది. ఆ తర్వాత రాజీవ్ గాంధీ నేషనల్ క్రెచ్ స్కీమ్ కింద షెడ్యూల్ తెగల పిల్లలకు మరో 24 ఏళ్ల పాటు బాలవాడి ఉపాధ్యాయురాలిగా బోధన చేసింది.

ఆమె లైబ్రేరియన్‌గా చేరినప్పుడు కూడా మరికొన్ని బాధ్యతలతో నిత్యం బిజీబిజీగా గడిపేది. మహిళల కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేది. రాష్ట్రపేదరిక నిర్మూలన, మహిళా సాధికారత కార్యక్రమమైన కుటుంబశ్రీలోనూ ఆమె కీలకంగా వ్యవహరించేవారు. కొంతకాలం పర్యాటకశాఖలోనూ గైడ్‌గా ఉద్యోగం చేశారు. అదే సమయంలో ఫ్రెంచ్, ఇంగ్లీష్ నేర్చుకున్నారు. గైడ్‌గా పనిచేసే సమయంలోనే కొండలపైకి ట్రెక్కింగ్ చేయడం రాధామణికి అలవాటైపోయింది. అయితే, వాకింగ్ లైబ్రేరియన్‌గా మారాక ఒకేసారి యాభయ్యేసి పుస్తకాలు తీసుకెళ్లడం ఒక్కోసారి బరువనిపించేదని, అందుకే, ఆ పుస్తకాల సంఖ్యను కేవలం 25కు కుదించానంటారు రాధామణి.

ఒక వాకింగ్ లైబ్రేరియన్‌గా కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తూ.. నిరక్షరాస్యుల్లో అవగాహన కల్పిస్తూ.. మరోవైపు ఎవరెవరు ఏ పుస్తకాలను తీసుకున్నారో రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటూ.. మళ్లీ ఇంటిపనులు, వంటపనుల్లోనూ రాధామణి చురుకుగా ఉంటారంటే ఆమె పనినెప్పుడూ ఓ భారంగా ఆలోచించలేదు. అందుకే సోమరితనం ఏనాడూ ఆమె దరి చేరలేదు. పైగా తన భర్త నిర్వహిస్తున్న చిన్నపాటి దుకాణంలోనూ ఆయనకు సాయపడ్తారు రాధామణి. ఉదయం ఐదున్నరకే తన జీవితాన్ని ప్రారంభించి.. ఇంటిపని త్వరగా ముగించుకుని ఈ నడిచే గ్రంథాలయం కాలిబాట పడుతుంది. సాయంత్రం మాత్రం అలసిసొలసి ఇంటికి చేరే రాధామణి.. ఆ తర్వాత పుస్తక పఠనం, టీవీ వంటివాటితో సేద తీరుతానంటోంది. అయితే, రాధామణిని ఈమధ్యకాలంలో బెన్యామిన్ రాసిన ఆడుజీవితం బాగా ఇన్‌స్పైర్ చేసిందట.

అసలు పుస్తకాలు చదవడమే గగనమైపోతున్న రోజుల్లో, డిజిటల్ మీడియా మానవ సమాజాన్ని ఆక్రమించిన కాలంలో, తనకాసక్తి ఉంటే తాను చదివితే సరిపోయేదానికి, ఇతరులతో.. అదీ మారుమూల గ్రామాల్లో మహిళల్లో, పిల్లల్లో చైతన్యం నింపే దిశగా రాధామణి ఓ వాకింగ్ లైబ్రరీగా మారి చేస్తున్న సేవ కొనియాడదగింది! కొందరు రచయితలు ఈ ప్రపంచాన్ని చూసే దృక్కోణాన్ని తమ రచనల్లో చెప్పే తీరు, మనం ప్రత్యక్షంగా చూసినవాటికంటే కూడా ప్రభావవంతంగా ఉంటాయని, అందుకే ప్రథమంగా తానో చదువరినని, అలాగే పల్లె జనంలోనూ ఆ చైతన్యం తెచ్చేందుకే తన తపన అనేది రాధామణి మాట!!

- రమణ కొంటికర్ల



• ఎడిటోరియల్

# తండ్రి రాజకీయం.. తనయుడి క్రికెట్ పాలనం!

రాజకీయాల్లో వారసుల పాత్ర గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. రాజకీయ వారసత్వంతోనే చాలామంది పదవుల సోపానాన్ని అవలీలగా ఎక్కేస్తూ ఉన్నత స్థానాలకు చేరుకుంటుంటారు. కొంతమంది తొలుత వారసత్వాన్ని తమ ఎదుగుదలకు వినియోగించుకున్నా తర్వాత సొంత ప్రతిభతో రాణిస్తూ తమదైన ముద్ర వేస్తుంటారు. కానీ రాజకీయ పార్టీల్లో తమది భిన్నమైనదని భారతీయ జనతా పార్టీ తరచూ చెప్పుకొంటుంటుంది. తమ పార్టీకి కొన్ని ప్రత్యేక సిద్ధాంతాలు, క్రమశిక్షణ ఉన్నాయని, వాటిని పెద్దాచిన్నా తేడా లేకుండా అందరికీ సమానస్థాయిలో వర్తింపజేస్తుంటామని మిగతా పార్టీల్లో ఇటువంటి కట్టుబాట్లు లేవని ఎద్దేవా చేస్తుంటుంది. రాజకీయాల్లో 75 ఏళ్లు దాటిన వారికి కచ్చితంగా విశ్రాంతి ఇవ్వడం, వారసత్వ రాజకీయాలు ప్రోత్సహించకపోవడం, ఒక నేతకు మూడుసార్లకు మించి పదవులు ఇవ్వరాదన్న నిబంధనలను తమ పార్టీలో కచ్చితంగా అమలు చేస్తుంటామని కమలనాథులు ఘనంగా చెప్పుకొంటుంటారు. కానీ చాలా సందర్భాల్లో ఆ పార్టీలో ఈ కట్టుబాట్లను తీసి పక్కన పెడుతున్న ఉదంతాలు చాలానే ఉన్నాయి. ముఖ్యంగా వారసత్వ రాజకీయాల విషయంలో బీజేపీ తన సిద్ధాంతాన్ని తానే ఉల్లంఘిస్తోంది. రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో చాలామంది బీజేపీ నేతల వారసులు పదవులు అనుభవిస్తున్నారు. అంతెందుకు కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని సుదీర్ఘకాలం నడిపిన యడ్యూరప్ప ముఖ్యమంత్రి పదవిలో ఉండానే ఆయన కుమారులు ఇద్దరూ కర్ణాటక బీజేపీలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వారిలో ఒకరైన విజయేంద్ర ఆ పార్టీ ఎంపీగా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. మరో కుమారుడు రాఘవేంద్ర కూడా పార్టీలో కీలకంగా ఉన్నారు. ఇక తాజాగా ప్రస్తుతం జాతీయస్థాయిలో కమలదళాన్ని, ఎన్డీయే సర్కారును తమ కనుసన్నల్లో నడిపిస్తున్న ద్వయంలోని ఒకరైన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పుత్రరత్నం కూడా తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. ఇంతవరకు క్రికెట్ భారతాన్ని శాసిస్తున్న ఆయన ఇప్పుడు ప్రపంచ క్రికెట్‌ను ఏలేందుకు సిద్ధమయ్యారు. అయితే క్రికెట్‌కు, రాజకీయాలకు సంబంధం ఏమిటన్న సందేహం కలగవచ్చు. ఈ రోజుల్లో క్రీడలు, రాజకీయాలు కలగలిసిపోయాయి. దేశంలోని దాదాపు ప్రతి క్రీడా సంఘాన్ని రాజకీయ నాయకులు లేదా వారి వారసులే నడిపిస్తున్నారు. తమ తండ్రుల రాజకీయ పరపతితో ఆయా క్రీడాసంఘాల కార్యవర్గ ఎన్నికల్లో విజయం సాధిస్తూ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికవుతూ వాటిని తమ చెప్పుచేతుల్లో పెట్టుకుంటున్నారు. తమ భవిష్యత్తు రాజకీయానికి వాటిని పావులుగా వాడుకుంటున్నారు. అందులోనూ మిగిలిన క్రీడాసంఘాల కంటే మన దేశంలో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ) చాలా పవర్‌ఫుల్. ఆర్థికంగా అత్యంత సంపన్న సంఘం కూడా. వేల కోట్ల రూపాయల ఆదాయం సంపాదిస్తున్న భారతీయ క్రికెట్ సంఘాన్ని కాంగ్రెస్ హయాంలో చాలా ఏళ్లు సురేష్ కల్మాడీ అనే మహారాష్ట్ర ఎంపీ పెత్తనం చెలాయించి రాజకీయాల్లో ఎదిగితే.. తర్వాత కాలంలో శరద్‌పవార్, ఎన్‌కేపీ సాల్వే, జగ్‌మోహన్ దాల్మియా, అరుణ్ జైట్లీ వంటి నేతలు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డుకు ఎన్నికై కీలకపాత్ర పోషించారు. వాటి ఆధారంగానే రాజకీయాల్లోనూ రాణించారు. అందువల్ల రాజకీయాలు, క్రికెట్ రెండింటినీ విడదీసి చూసే పరిస్థితి లేదు. ఇప్పుడు అమిత్‌షా వారసుడైన జైషా బీసీసీఐ కార్యదర్శి స్థాయికి ఎదగడం.. తాజాగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అధ్యక్షుడిగా ఎన్నిక అయిన క్రమాన్ని పరిశీలిస్తే అంతర్లీనంగా రాజకీయ ప్రభావం కచ్చితంగా కనిపిస్తుంది. తండ్రి అమిత్‌షా రాజకీయ రంగంలో ఒక్కో మెట్టు ఎక్కుతుంటే.. అదే సమయంలో తనయుడు జైషా కూడా స్వరాష్ట్రమైన గుజరాత్ నుంచి క్రికెట్ రాజకీయాల్లో ఎదుగుతూ వచ్చారు. 35 ఏళ్ల చిన్న వయసులోనే ఐసీసీ అధ్యక్ష పదవికి ఎన్నికైన ఆయన చిన్నతనం నుంచి క్రికెటర్ అవ్వాలనుకుని.. చివరికి క్రికెట్‌ను శాసించే స్థాయికి ఎదిగారు. చదువు పూర్తి అయిన తర్వాత కుటుంబ వ్యాపారమైన పైపుల బిజినెస్ చేపట్టారు. స్టాక్ బ్రోకర్‌గా కూడా కొన్నాళ్లు పని చేశారు. తండ్రి అమిత్‌షా అడుగుజాడల్లో రాజకీయాల్లోకి కూడా ఎంట్రీ ఇచ్చినా.. తర్వాత వ్యాపారంపై దృష్టి సారించారు. ఒకవైపు వ్యాపార రంగంలో కొనసాగుతూనే మరోవైపు క్రికెట్ పాలకవర్గ వ్యవహారాల్లోకి ప్రవేశించారు. 2009లో గుజరాత్ క్రికెట్ సంఘం పాలకవర్గంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తొలిసారి ఎన్నికయ్యారు. అదే సమయంలో తండ్రి అమిత్‌షా గుజరాత్‌లోని నరేంద్రమోదీ ప్రభుత్వంలో మంత్రిగా ఉండటం ఆయనకు కలిసివచ్చింది. 2013లో గుజరాత్ క్రికెట్ సంఘం జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించి తొలిసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి పదవి చేపట్టగా, ఆయనతో పాటే అమిత్‌షా కూడా ఆయన కేబినెట్‌లో మంత్రి పదవి చేపట్టి నెంబర్ టూ స్థానంలో కొనసాగుతున్నారు. దాదాపు అదే సమయంలో అంటే 2015లో జైషా భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ)లోని సభ్యుడిగా ఎంట్రీ ఇవ్వడం విశేషం. 2019 సెప్టెంబర్‌లో బీసీసీఐ కార్యదర్శి పదవికి ఎన్నికయ్యారు. 2021లో అసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ పదవికి కూడా ఎన్నికైన ఆయన బీసీసీఐ అధ్యక్షుడిగా ఉన్న సౌరభ్ గంగూలీ పదవీ కాలం ముగిసి రోజర్‌బిన్నీ ఆ పదవి చేపట్టినా బీసీసీఐ వ్యవహారాల్లో జైషా హవాయే సాగుతోంది. అసలు క్రికెట్ బ్యాట్ పట్టుకోవడమే రాని జైషా తండ్రి రాజకీయ పరపతితోనే అత్యంత వేగంగా క్రికెట్ పాలకమండలిని శాసించే స్థాయికి ఎదిగారన్న విమర్శలు చాలాకాలం నుంచే ఉన్నాయి. ఆ విమర్శల మాటెలా ఉన్నా భారత క్రికెట్ సంఘాన్ని అత్యంత సంపన్న సంఘంగా, అదిపెద్ద ఆదాయ వనరుగా మార్చడంలో లలిత్‌మోదీ తర్వాత జైషాదే కీలకపాత్ర అనడంలో సందేహం లేదు.




# ఆరోజే.. బిల్ పాసయ్యుంటే!!

ఆ బిల్ పాస్ అయ్యుంటే మన ఆరోగ్యాలు మరింత మెరుగైన స్థితిలో ఉండేవి! ప్రస్తుతం 35 ఏళ్లు దాటిన ఎంతోమంది బీపీ, డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడుతున్నారు. మన ఆహారపు అలవాట్లే ఇలా చిన్న వయసులోనే అనేక రోగాలకు కారణం. ఒకానొక దశలో భారతీయులు తమ వంటల్లో వనస్పతి వాడటం వల్లే అధిక కొలెస్ట్రాల్‌కు కారణమని తేల్చింది. వనస్పతి వాడకం వల్ల గుండె జబ్బులు పెరిగిపోయాయని, అనేక మరణాలకు అదే కారణమని విశ్లేషించారు. అసలు ఈ




వనస్పతి వాడకం ఇండియాలోకి ఎలా ప్రవేశించింది. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో అనేక విదేశీ కంపెనీలు ఇండియన్ మార్కెట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించాయి. అలా ఆసక్తి చూపిన సంస్థలో 'డాల్డా' కూడా ఒకటి. నెదర్లాండ్స్‌కు చెందిన 'దాదా' అనే కంపెనీ నెయ్యిని విక్రయించేది. అయితే తమ నెయ్యి అధిక ధర ఉండటంతో పేదలు, మధ్యతరగతి వాళ్లు కొనుగోలు చేసే వారు కాదు. దీంతో నెయ్యిని పోలిన వనస్పతిని మార్కెట్లోకి తీసుకొచ్చారు. పామాయిల్‌ను 'హైడ్రోజినేటెడ్' చేయడం ద్వారా నెయ్యిని పోలిన వనస్పతి తయారవుతుంది. నెయ్యితో వంటలు చేస్తే ఎంత రుచిగా ఉంటాయో.. ఈ వనస్పతితో చేసిన వంటలు కూడా అంతే రుచిగా ఉండేవి. దాదా కంపెనీని యూనిలీవర్ కొనుగోలు చేశాక, దాని పేరు డాల్డాగా మార్చింది. ఇండియాలో డాల్డా పేరుతో విక్రయాలు మొదలు పెట్టింది. భారతీయులు మొదట్లో డాల్డాపై విముఖత చూపించారు. దాని వాసన, నేరుగా రుచి చూస్తే వికారంగా ఉండటంతో మొదట్లో ఎవరూ పెద్దగా కొనుగోలు చేయలేదు. అయితే పత్రికల్లో, హోర్డింగుల ద్వారా మంచి ప్రకటనలు ఇచ్చి సేల్స్ భారీగా పెంచుకుంది. హోటల్స్, స్వీట్ షాప్స్‌తో పాటు పేద, మధ్యతరగతి వంటల్లో డాల్డా ఒక భాగమైపోయింది. అయితే ఈ డాల్డా వాడకం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అనేక మంది ఆరోగ్య నిపుణులు అప్పటి ప్రధాని నెహ్రూ దృష్టికి తీసుకొని వచ్చారు. కాంగ్రెస్ మాజీ ఎంపీ పండిట్ తుకార్‌దాస్ భార్గవ 'డాల్డా'ను బ్యాన్ చేయాలని గళమెత్తారు. ప్రభుత్వ మద్దతుతో లోక్‌సభలో వనస్పతిని బ్యాన్ చేయాలని బిల్ కూడా ప్రవేశపెట్టారు. అయితే బిల్ మీద చర్చించే క్రమంలో మిగతా సభ్యుల సూచన మేరకు దానిపై ఒక సర్వే చేయాలని నిర్ణయించారు. డాల్డా ఉత్పత్తి కోసం అప్పట్లో 47 ఫ్యాక్టరీలు తెరిచారు. అందులో దాదాపు 30వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. ఇక దేశంలో రూ.5వేల కోట్ల విలువైన పామాయిల్ పంటను వేలాది మంది రైతులు సాగు చేయడం ప్రారంభించారు. ఒక్కసారిగా డాల్డాను బ్యాన్ చేయడం వల్ల వీళ్లందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి చూపించడం సాధ్యం కాదని.. దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడుతుందని సర్వేలో తేల్చారు. మరోవైపు పండిట్ ఠాకూర్‌దాస్ మనసులో ఏదో పెట్టుకొని డాల్డాకు వ్యతిరేకంగా బిల్లు ప్రవేశపెట్టారనే ఆరోపణలు కూడా వచ్చాయి. దీంతో ప్రధాని నెహ్రూ ఆ బిల్లును పక్కన పెట్టేశారు. ఇక ఆ తర్వాత డాల్డా విక్రయాలు మరింతగా పెరిగిపోయాయి. కాలక్రమంలో అక్షరాస్యత పెరగడం, ఆరోగ్యంపై ప్రజలకు శ్రద్ధ పెరగడంతో డాల్డా (వనస్పతి) వాడకాన్ని తగ్గించారు. డాల్డాలో పశువుల కొవ్వును కలుపుతున్నా రనే వార్తలు కూడా దాని వాడకాన్ని తగ్గించింది. ప్రస్తుతం ఇళ్లల్లో డాల్డా వాడకం పూర్తిగా తగ్గింది. కానీ హోటల్స్, మిఠాయి దుకాణాల్లో మాత్రం ఇంకా కొనసా గుతోంది. ఒకవేళ ఆ రోజు బిల్ ప్రవేశపెట్టి, ఆమోదించి ఉంటే మన ఆరోగ్యాలు మరింత మెరుగుగా ఉండేవనడంలో ఎలాంటి సందేహం లేదు.

- భాయ్‌జాన్




# బాలయ్య.. ది లెజెండ్

నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా టాలీవుడ్ లోని అన్ని విభాగాల ఆధ్వర్యంలో భారీ వేడుక కి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 1న నిర్వహించబోతున్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో పాటు పలువురు మంత్రులు ఇంకా టాలీవుడ్ స్టార్స్, ఇతర భాషల సినీ ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొనే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. ప్రముఖ ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థ నిర్వహిస్తున్న ఈ వేడుక కి సంబంధించిన ప్రతి విషయం కూడా ఆసక్తి రేకెత్తిస్తోంది.

తాజాగా బాలయ్య సినీ కెరీర్‌ను తెలిజేసే విధంగా ఒక పోస్టర్‌ను వేడుక నిర్వాహకులు రిలీజ్ చేశారు. ప్రస్తు తం ఆ పోస్టర్‌ను బాలయ్య ఫ్యాన్స్‌తో పాటు నెటిజన్స్ తెగ షేర్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ పోస్టర్‌లోని విషయాలు బాలయ్య ది లెజెండ్ అంటూ చెప్పకనే చెబుతున్నాయి అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. 50 ఏళ్ల సినీ కెరీర్ లో బ్రేక్ లేకుండా బాలయ్య నటిస్తూనే ఉన్నాడు. ఈ 50 ఏళ్లలో ఆయన ఇండస్ట్రీలో అన్‌స్టాపబుల్ గా కొనసాగుతూనే ఉన్నాడు. మొత్తం 109 సినిమాల్లో కూడా హీరోగా లేదా లీడ్ రోల్స్‌లో మాత్రమే బాలయ్య నటించాడు. బాలయ్య చేసిన సినిమాల కంటే ఆయన నటించిన హీరోయిన్స్ సంఖ్య చాలా ఎక్కువ. 109 సినిమాలకు గాను 129 మంది హీరోయిన్స్ తో బాలకృష్ణ నటించి అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకున్నాడు. బాలకృష్ణ నటించిన సినిమాల వసూళ్ల విషయానికి వస్తే గతంలో రూ.10 లక్షల దక్కించుకోగా, ఈ మధ్య వచ్చిన సినిమాలతో రూ.250 కోట్ల వసూళ్లు కూడా దక్కించుకున్నాడు. బాలయ్య కు ఫ్యాన్స్ 10 ఫీట్ల కటౌట్ నుంచి 108 ఫీట్ల కటౌట్స్ వరకు ఏర్పాటు చేశారు. ఇక బాలయ్య నటించిన సినిమాలు ఎన్నో 100 రోజులు ఆడాయి. 100 రోజుల నుంచి 1000 రోజులు ఆడిన సినిమాలు కూడా బాలయ్య కెరీర్ లో ఉన్నాయి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# కళ్యాణ్‌రామ్ నెక్స్ట్ సినిమాకు ఊహించని డైరెక్టర్!



నందమూరి హీరో కళ్యాణ్ రామ్ ప్రస్తుతం తన కెరీర్ లో 21వ సినిమాతో బిజీ బిజీగా ఉన్నారు. అలాగే తన సోదరుడు ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా సినిమా దేవర సినిమాను నిర్మిస్తున్నారు. ఇక కళ్యాణ్ రామ్ 21వ సినిమాకు ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తుండగా ఈ సినిమా కంప్లీట్ యాక్షన్ ఎంటర్టైనర్ గా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమాలో కళ్యాణ్ రామ్ సరికొత్త పాత్రలో కనిపించనున్నాడు. అలాగే ఈ సినిమాలో లేడీస్ సూపర్‌స్టార్ విజయశాంతి కూడా ఓ కీలక పాత్రలో నటిస్తుండడంతో సినిమాపై అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఈ సినిమా తర్వాత కళ్యాణ్ రామ్ తర్వాత సినిమాను కూడా ఓకే చేసినట్టు టాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. టాలీవుడ్ లో కుమారి 21ఎఫ్, 18 పేజెస్ లాంటి సూపర్ హిట్ సినిమాలు తెరకెక్కించి మంచి పేరు తెచ్చుకున్న యువ దర్శకుడు పల్నాటి సూర్య ప్రతాప్ కళ్యాణ్ రామ్‌కు కథ చెప్పి లాక్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ కథ నచ్చిన తర్వాత సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాని త్వరలోనే పట్టాలెక్కించనున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌పై కళ్యాణ్ రామ్ సొంత బ్యానర్లో ఈ సినిమా తెరకెక్కనుంది. సుకుమార్ శిష్యుడైన సూర్య ప్రతాప్ తెరకెక్కించే ఈ సినిమాను సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ కో ప్రొడ్యూస్ చేస్తుందా లేదా అన్నది మాత్రం ఆసక్తిగా మారింది.

- తెలుగులైవ్స్.కామ్ సౌజన్యంతో...

# ముంచినా తేల్చినా ప్రభాసే!

తక్కువ సమయంలో వంద సినిమాలు తీయాలన్న లక్ష్యంతో ముందుకొచ్చింది పీపుల్ మీడియా ఫ్యాక్టరీ. 'ఈ తక్కువ రోజుల్లో' అనే టైమ్ లైన్‌తో స్పీడు పెరిగింది కానీ, క్వాలిటీ తగ్గిపోయింది. ఎడా పెడా సినిమాలు తీసుకొంటూ నెలకొకటి చొప్పున టాలీవుడ్ లోకి వదులుతోంది ఈ సంస్థ. కానీ సరైన హిట్లే రావడం లేదు. రీసెంట్ గా 'మిస్టర్ బచ్చన్' కూడా తేడా కొట్టేసింది. ఈ సినిమాతో భారీగా నష్టపోయింది పీపుల్ మీడియా. ఇది వరకు సినిమాలేమైనా సూపర్ హిట్లు అందించాయా అంటే అదీ లేదు. పీపుల్ మీడియా సక్సెస్ రేటు 40 శాతం కూడా లేదు. నవంబరులో ఈ సంస్థ నుంచి 'స్వాగ్', 'విశ్వం' చిత్రాలు విడుదల అవుతున్నాయి. 'స్వాగ్' చిన్న సినిమా. హిట్టయినా భారీ లాభాలు రాకపోవొచ్చు. గోపీచంద్ – శ్రీనువైట్ల 'విశ్వం'పై ఎవరికీ పెద్దగా అంచనాలు లేవు. భారీ హిట్టు కొట్టి, కనీవినీ రీతిలో వసూళ్లు సాధించినా పీపుల్ మీడియా గత ఫ్లాపుల్ని, నష్టాల్నీ పూడ్చేంత స్టామినా 'విశ్వం'కు ఉండదు. ఇక పీపుల్ మీడియా ఫ్యాక్టరీ జాతకం మొత్తం ప్రభాస్ 'రాజాసాబ్' చేతుల్లో ఉంది. ప్రభాస్–మారుతి కాంబోలో రూపు దిద్దుకొంటున్న సినిమా 'రాజా సాబ్'. వచ్చే యేడాది ప్రేక్షకుల ముందుకు వస్తోంది. పీపుల్ మీడియా చేతుల్లో ఉన్న భారీ ప్రాజెక్ట్ ఇది. ఈ సంస్థని ముంచినా, తేల్చినా ఈ సినిమాకే సాధ్యం. ఎందు కంటే ఇది ప్రభాస్ సినిమా. తను హిట్ కొడితే బండి వెయ్యి కోట్ల దగ్గరే ఆగేది. కాస్త యావరేజ్ టాక్ వచ్చినా రూ.500 కోట్లు తగ్గదు. మరీ 'కల్కి' లా కాకపోయినా హిట్ అయినా మినిమం రూ.300 కోట్లు గ్యారెంటీ. అదే పీపుల్ మీడియా భరోసా. లాభనష్టాల మాట అటుంచితే, ఓ పెద్ద హిట్ కొట్టామన్న తృప్తి ఇప్పుడు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అత్యవసరం. అదృష్టం బాగుంటే, 2024లో వచ్చిన ఫ్లాపులన్నింటికీ 'రాజాసాబ్' సినిమా ఒక్కటే సమాధానం చెప్పగలదు కూడా. అందుకే పీపుల్ మీడియా ఈ సినిమాపై ప్రత్యేకమైన దృష్టి నిలిపింది. క్వాలిటీలో రాజీ పడకుండా ఈ చిత్రాన్ని రూపొందిస్తోంది. ప్రభాస్ డేట్లు కేటాయించడంలో ఇబ్బంది పెట్టినా, నిర్మాతలు ఓర్చుకొన్నారు. రిలీజ్ డేట్ విషయంలోనూ తొందర పడడం లేదు. పాన్ ఇండి యా సినిమా ఇది. లాంగ్ వీకెండ్ అయితే బాగుంటుందన్న ఆలోచనతో.. ఓ మంచి డేట్ కోసం అన్వేషిస్తోంది పీపుల్ మీడియా.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...



## జెడ్పీ హైస్కూల్‌లో వైద్యపరీక్షలు

(సత్యంన్యూస్, టెక్కలి)

ఎస్ఎంసీ ఆధ్వర్యంలో బూరగాం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఎస్ఎంసీ చైర్మన్ జి.రాజు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. తీవ్రంగా వర్షాలు పడటం, సీజనల్ వ్యాధుల దృష్ట్యా విలేజ్ హెల్త్ క్లినిక్ సహకారంతో సుమారు 130 మందికి హెచ్‌బి, మలేరియా, బీపీ, బరువు, ఎత్తు, ఎంఎల్‌హెచ్‌పిపి, ఏఎన్ఎం బి.సీతమ్మ, ఎం.పద్మావతి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సూత్రాలను తెలిపారు. వేడినీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జి.రాజు, ప్రధానోపాధ్యాయులు గుట్ట రాము, ఉపాధ్యాయులు అచ్యుతరావు, వెంకటలక్ష్మి, మాణిక్యం, అలివేలు, సింహాచలం, చంద్రప్రభ, ఆశా కార్యకర్తలు పి.సరోజినీ, జి.సుజాతమ్మ, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



## శర్వాణిలో తెలుగుభాషా దినోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకొని అరసవల్లి రోడ్డులోని శర్వాణి విద్యాలయలో తెలుగు భాషా దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ గ్రాంధిక భాషా సంకెళ్ల నుంచి వ్యవహారిక భాషకు విముక్తి కల్పించి తెలుగు భాషకు తియ్యదనాన్ని, మాధుర్యాన్ని అందించిన భాషా శాస్త్రవేత్త గిడుగని కొనియాడారు. హెడ్మిస్ట్రెస్ డాక్టర్ కె.రేఖ మాట్లాడుతూ గ్రాంధిక భాషకు పిడుగు, వ్యవహారిక భాషకు గొడుగు గిడుగు అని అన్నారు. కార్యక్రమంలో శర్వాణి విద్యార్థిని ఎన్.జాహ్నవి (9వ తరగతి) తెలుగుభాష గొప్పదనాన్ని తెలియజేయగా, తెలుగు భాష గురించి పాటల రూపంలో ప్రణీత బృందం, దేవశ్రీ బృందం ఆలపించారు. డబ్ల్యూ.వి.ఎస్ నవీన్ మణికంఠ (10వ తరగతి) కవిత్రయం గురించి వివరించాడు. 5వ తరగతి విద్యార్థులతో తెలుగు పద్యాలు గానం చేసారు. కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## త్రినాధరావుకు మాతృవియోగం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)



సీనియర్ జర్నలిస్టు తమ్మినేని త్రినాధరావు మాతృమూర్తి శార్వాణి (83) గత కొన్ని రోజులుగా అస్వస్థతతో బాధపడుతూ బుధవారం కొత్తపేటలో కన్నుమూశారు. గ్రామస్తులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, మిత్రులు పెద్ద ఎత్తున కొత్తపేట చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు.

## గిడుగుకు తెరవే నివాళి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

వ్యవహారిక భాషా పితామహుడు, సవరభాష అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా న్యూబ్రిడ్జ్ రోడ్డులోని దత్త కోవెల వద్ద ఉన్న గిడుగు విగ్రహానికి తెరవే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణ మూర్తి ఆధ్వర్యంలో తెరవే సభ్యులు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు మన జిల్లావాసి కావటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో తెరవే సభ్యులు నాగేశ్వరరావు, ఆర్‌వీ రమణమూర్తి, భోగెల ఉమామహేశ్వరరావు, వావిలపల్లి రాజారావు, ఐఎన్‌డి ప్రసాద్, తంగి ఎర్రమ్మ పాల్గొన్నారు.



## ఎరువుల కొరత లేకుండా చర్యలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో ఎరువుల కొరత లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం శ్రీకాకుళం జడ్పీ సమావేశంలో ఎరువుల కొరత సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేలు అధికారులను కోరారు. ఈ అంశంపై పత్రికల్లో చూసి తక్షణ చర్యలకు మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లాకు తక్షణమే 820 టన్నుల డీఏపీ, 760 టన్నుల యూరియాను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం రాత్రికి అదనపు ఎరువులు జిల్లాకు చేర్చి శుక్రవారం నుంచే రైతులకు పంపిణీ చేయాలని అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

## గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

పెద్దపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం(బాలికలు)లో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి తెలిపారు. ఐదో తరగతి ఎస్సీ కేటగిరిలో 19 సీట్లు, ఓసీ 1, 6వ తరగతి ఎస్సీ కేటగిరిలో 5 సీట్లు, 9వ తరగతి ఎస్సీ కేటగిరిలో 1 సీటు, ఎస్‌టి కేటగిరీలో 1సీటు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ 7 ఎస్సీ కేటగిరిలో, బైపీసీ ఎస్సీ 6, ఎస్టీ కేటగిరిలో 1, బీసీ కేటగిరిలో 1, ఓసీ కేటగిరిలో 1 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సీట్లు కావాల్సిన విద్యార్థినిలు ఈ నెల 30న ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో గురుకులంలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ జ్యోతి కోరారు. సీట్లకు మించి అధికంగా విద్యార్థుల హాజరైతే పరీక్ష విధానాన్ని బట్టి సీట్లు కేటాయిస్తామన్నారు.

## తెలుగు భాష గొప్పతనం చాటిచెప్పాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇద్దరు తెలుగువారు కలిసేటప్పుడు తెలుగులోనే మాట్లాడాలని, తెలుగు భాష గొప్పతనాన్ని చాటి చెప్పాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు పిలుపునిచ్చారు. గురువారం తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని కళాశాల ఆవరణలోని గిడుగు విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం తెలుగు విభాగాధిపతి పి.నారాయణరావు మాట్లాడుతూ తెలుగు మాతృభాష కానివారు కూడా తెలుగును ప్రశంసించకుండా ఉండలేరని అన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే నగదు ప్రోత్సాహక బహుమతులు స్పెషల్ తెలుగులో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు గిడుగు వారసులు సూర్యనారాయణ, సరస్వతి, గణేష్ కార్తీక్ అందించారు. అనంతరం కవితల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో అవధాన శిరోమణి పైడి హరినాథ్, పీవీ రమణ, ఎస్.ఢిల్లీశ్వరరావు, వై.పోలినాయుడు, సిహెచ్ రామమూర్తి, ఆదినారాయణ, రాజశేఖర్, శ్రీనివాస పాత్రో, అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎన్‌సీఎస్‌లో క్రీడాదినోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి, ప్రఖ్యాత క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు పీఎన్ కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, విద్వాన్ పైడి హరినాధరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త నిష్ఠల నరసింహమూర్తి ముఖ్య అతిథులుగా హాజరై తెలుగు భాష ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. విశ్రాంత డీఈవో, పాఠశాల ప్రిన్సిపల్ బలివాడ మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులకు పాఠశాల వ్యవస్థాపకులు జగన్ మోహన్ రావు, ప్రిన్సిపల్ మల్లేశ్వరరావులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల తెలుగు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు)లో వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఈ దశలోనే క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కళాశాల వ్యాయామ విభాగధిపతి బర్రి మోహనరావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు అనేకమంది జాతీయస్థాయిలో మంచి గుర్తింపు పొందారని తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో వివిధ క్రీడలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎంవీ సత్యనారాయణ, వ్యాయామ అధ్యాపకులు జ్యోతికుమార్, ఎన్‌సీసీ కెప్టెన్ పోలినాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ పాత్రో, కెమిస్ట్రీ విభాగ అధిపతి ఆదినారాయణ, అర్థశాస్త్ర విభాగ విభాగాధిపతి సీహెచ్ రామమూర్తి, శశిభూషణరావు, రమణ, ఢిల్లేశ్వరరావు, మోహనరావు, రాజశేఖర్, ప్రదీప్, నారాయణరావు, ఇతర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## పారా మిలిటరీ భవనం ప్రారంభం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పైడితల్లి గుడి దగ్గర నూతనంగా నిర్మించిన పారామిలటరీ భవనాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం ప్రారంభించారు. భవన పూజా కార్యక్రమం పూర్వ సైనికులు గంగిట్ల శ్రీనివాసరావు దంపతుల చేతుల మీదుగా జరగగా, ముఖ్య అతిథులుగా రణబీర్ సింగ్ (న్యూఢిల్లీ), చింతాడ రంగనాథం 2ఐసీ (ఎస్ఎస్‌బీ), అసోసియేషన్ ఇతర రాష్ట్రాల, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల పారామిలటరీ అధ్యక్షులు, బృందం హాజరయ్యారు. ఈ భవనాన్ని దేశ సరిహద్దులో పహరా కాస్తున్న పారా మిలిటరీ బలగాల సైనికులు తమ సొంత విరాళాలతో నిర్మించుకున్నారని సంఘం అధ్యక్షులు కె.రామారావు, వైఎ నాయుడు తెలిపారు. జీఎస్‌బీ సుబ్రమణ్యం, ఎస్.రవి మాట్లాడుతూ పారామిలిటరీ సైనికులు దేశ సరిహద్దుల్లోనూ, అంతర్గతంగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి లభించాల్సిన సంక్షేమ పథకాలు ఏవి కూడా అందకుండా పోతున్నాయనే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ దేశ రక్షకుల సేవలు గుర్తించి సంక్షేమ పథకాల్లో తగిన స్థానాన్ని కల్పించాలని కోట్ని లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. పూర్వ సైనికులు కేవీఆర్ మూర్తి మాట్లాడుతూ ఈ సంఘం బలోపేతానికి జిల్లా మొత్తంగా ఉన్న దేశ రక్షకులందరూ ఏకతాటిపై ఉండడానికి సైనికులు అట్ల సుమన్, డోల నాగరాజుల కృషి ఎంతో ఉందన్నారు. జిల్లా పారామిలిటరీ సైనికులు, పూర్వ సైనికులు, వారి ఆధారిత కుటుంబ సభ్యులందరికీ భవిష్యత్తులో కార్యక్రమాలకు ఈ భవనం వేదిక కానుందని అన్నారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ జక్కల వంశీకృష్ణ, అసోసియేషన్ సభ్యులు ఎస్.రవి, జి.శ్రీను, వై.ఎస్.నాయుడు, కె.లక్ష్మణరావు, కెవైఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సమున్నత భాష కోసం.. సమష్టి ఉద్యమం

భావ గ్రహణ, భావ వ్యక్తీకరణలు నిర్దిష్టమైన భాషాలక్ష్యాలు అని కొత్తగా చెప్పనవసరం లేదు. భాష ఈ రెండింటికే పరిమితం అయితే భాషకున్న శక్తి పెద్దగా చెప్పుకోనవసరం లేదు. కానీ మనిషి భావంలో, భావోద్వేగంలో, భావ నియంత్రణలో, భావ సమన్వయంలో.. అన్నింటిలోనూ భాష తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది. అందునా మాతృభాషకున్న ప్రాధాన్యం ఎంతో చెప్పడానికి అక్షరాలు చాలవు. ఎవరు ఏ భాషలో అభ్యసనం చేసినా మాతృభాషలో మాత్రమే ఆలోచన చేయగలుగుతారు. మాతృభాషతో ఉన్న అనుబంధం తల్లితో ఉన్న పేగుబంధం లాంటిది. ఇదే విషయాన్ని అనేకమంది భాషావేత్తలు, మనోవైజ్ఞానిక తత్వవేత్తలు సశాస్త్రీయంగా నిరూపించారు. అయితే ఆంధ్ర, తెలంగాణ వంటి తెలుగు రాష్ట్రాల్లోనూ తెలుగు మాట్లాడే ప్రజానీకంలోనూ తెలుగు భాష పట్ల ఏదో తెలియని ఓ నిర్లక్ష్యం రాబోయే రోజుల్లో తెలుగు భాష ప్రాముఖ్యతకు నీలినీడలు కమ్మేలా చేస్తోంది. పరభాషా వ్యామోహంలో, ఉపాధి చదువుల ఉక్కపోతలో తెలుగు భాష ఉక్కిరిబిక్కిరి అవుతోంది..

### మాతృభాషలో విద్యాబోధన:

స్వరాజ్య ఉద్యమం విజయవంతం కావడంలో మాతృభాష ప్రాధాన్యాన్ని గుర్తించిన మహాత్మా గాంధీ 1938లోనే తన 'హరిజన్' పత్రికలో బాలబాలికలకు ఆంగ్ల మాధ్యమ విద్యాబోధన చెయ్యడాన్ని తప్పుపట్టారు. నిజమైన భావ ప్రేరేపణ, ప్రగతి మాతృభాష వల్లనే వస్తుందని, స్వభాషలో విద్య ఉంటే, మనకు స్వరాజ్యం ఎప్పుడో వచ్చేదని 'గాంధీజీ' రాశారు.

మాతృభాషలో విద్యాభ్యాసం వల్ల బుద్ధి వికసిస్తుందని, నాడులు చురుకుగా పని చేస్తాయని విశ్వకవి రవీంద్రుడు అన్నారు. మాతృభాషలో విద్యాబోధన వల్ల గ్రహణ, వ్యక్తీకరణ సామర్థ్యం పెరుగుతుందని శాస్త్రజ్ఞులు అంటున్నారు. 'మాతృభాషలో విద్య వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక శక్తులు పెంపొందుతాయి. రచయితలుగా, కవులుగా, వక్తలుగా, విశ్లేషకులుగా, తీర్పరులుగా వెలుగొందడానికి మాతృభాష ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. ఇదే విషయాన్ని అనేక మంది నిరూపించారు కూడా. 'మాతృభాష తల్లిపాల వంటిది. పరభాష పోతపాల వంటిది.' అని కొమర్రాజు లక్ష్మణరావు అన్న మాట అక్షర సత్యం.

### తెలుగు నేలపై మసక బారిన వెలుగు:

దురదృష్టవశాత్తూ తెలుగు వెలుగులు విరజిమ్మాల్సిన తెలుగు రాష్ట్రాల్లో తెలుగు పట్ల కనీస బాధ్యత లేకుండా పాలకులు వ్యవహరిస్తుండడం బాధిస్తోంది. జాతీయ విద్యావిధానం అమలు పేరుతో ప్రాథమిక స్థాయి నుంచి బడుల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టిన తెలుగు భాష పట్ల చిన్న చూపును ప్రదర్శిస్తున్నారు. అసలు జాతీయ విద్యా విధానం చెప్పిందే మాతృభాషా ప్రాధాన్యత గూర్చి. శాస్త్ర, సాంకేతిక విద్యలు కూడా మాతృభాషలో అందుబాటులోకి తేవాలని జాతీయ విద్యా విధానం చేసుకున్న బృహత్ సంకల్పాన్ని విస్మరించి అందుకు విరుద్ధంగా పూర్తిస్థాయిలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రాథమిక స్థాయి నుంచి ప్రవేశపెట్టడం మాతృభాషను భ్రష్టు పట్టించడమే అవుతుంది. విద్యార్థులను రెంటికీ చెడ్డ రేవడిలా మార్చడమే అవుతుంది.

వేల ఏళ్ల సాహిత్యం, విస్తృతమైన భావ సంపద ఉన్న తెలుగు రాబోయే రోజుల్లో మరింత ప్రాభవాన్ని కోల్పోయే ప్రమాదాన్ని గుర్తించిన స్వచ్ఛంద సంస్థలు, భాషోద్యమ సంస్థలు తెలుగు భాష కోసం మాతృభాషను పాఠశాలల్లోనూ సజీవంగా ఉంచేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. ఈ సందర్భంగా వేమన, సుమతీ శతకాలు వంటి పద్యాలు, కవితలు, వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు, నృత్య పోటీలు నిర్వహించి ప్రోత్సాహకాలు అందించి విద్యార్థులకు తెలుగు భాషపై మమకారం పెంచే విధంగా కృషి చేస్తున్నాయి. ఈ కృషికి ప్రభుత్వాలు తమ వంతు సహకారాన్ని అందించాలి.

పాలకులకు తెలుగు భాష పట్ల మమకారం, అంకిత భావం ఉండాలి. ప్రజల వద్దకు పాలన అన్నది తెలుగు భాషను పరిపాలనా భాషగా పూర్తిగా అమలుపరిచినప్పుడే సాధ్యమవుతుంది. అప్పుడెప్పుడో విలియం బెంటిక్ ఇలా చేశాడు, లార్డ్ మెకాలే అలా చేశాడు అంటూ దీర్ఘోపన్యాసాలు ఇవ్వడం మానేసి మన జన్యువుల్లో నిండి నిబిడీకృతమైన తెలుగు భాష కోసం మనం ఏమి చేశామన్నది ప్రశ్నించుకోవాలి. తెలుగు భాషా, సాహిత్యాలు సుసంపన్నం చేయడానికి కృషి చేసిన మహనీయుల స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ ఉద్యమ స్ఫూర్తితో కదలాలి. మాతృ భాషాభిమానం మాటలకే పరిమితమైతే 'దేశ భాషలందు తెలుగు లెస్స' కాస్తా 'లెస్' అనే పరిహాసానికి గురికాక తప్పదు. కాబట్టి ప్రభుత్వాలు తెలుగు పట్ల శ్రద్ధ వహించాలి. అధికారులు, ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలి. పత్రికలు, ప్రసార మాధ్యమాలు తెలుగు విస్తృతికి



దోహదపడాలి. పరిపాలనా భాషగా, బోధనా భాషగా అమ్మ భాష వెలగాలంటే క్షేత్రస్థాయి నుంచీ భాషాభిమానులు, విద్యార్థులు, సామాజిక ఉద్యమకారులు ఎలుగెత్తాలి. పటిష్టమైన చట్టాలు రూపొంది అమలుకావాలి. అప్పుడే తెలుగు వెలుగు నలుదిశలా వ్యాపిస్తుంది.

**- రఘుపాత్రుని శ్రీనివాసరావు, రచయిత, తెలుగు భాషోపాధ్యాయుడు, శ్రీకాకుళం**















# జగనన్న ఇళ్లు.. కష్టాల సవాళ్లు

మొదటిపేజీ తరువాయి

ఆసక్తి చూపడంలేదు. జనావాసాలకు దూరంగా కొండలు, గుట్టల సమీపంలో లే అవుట్లు వేయడం వల్ల తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ వంటి సౌకర్యాలన్నింటినీ కొత్తగా కల్పించాల్సిన పరిస్థితి. కానీ అధికారులు ఆ పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా కాలనీల్లో చిన్నపాటి వర్షాలకే నీటితో నిండిపోయి, అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇక ఎక్కడో దూరప్రాంతాల నుంచి విద్యుత్ లైన్లు పొడిగించి కాలనీలకు కరెంటు ఇవ్వడం అనేక సమస్యలతో కూడుకున్నది కావడంతో చాలా కాలనీల్లో మెయిన్ లైన్లు వేయడంలోనే జాప్యం జరుగుతోంది. అవి పూర్తి అయితే తప్ప ఇంటింటికీ కనెక్షన్ ఇచ్చే అవకాశం ఉండదు. అలాగే రోడ్లు, కాలువల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి.

* లావేరు మండలం బెజ్జిపురం గ్రామంలో 114 ఇళ్లతో కాలనీ ఏర్పాటు చేయగా ఇప్పటికీ అక్కడ 40 ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. వర్షం పడితే కాలనీ చెరువులా మారిపోతోందని లబ్ధిదారులు చెబుతున్నారు.

* నరసన్నపేట మండలం ఉర్లాంలో పంట పొలాలకు వెళ్లే గోర్జి మార్గంలో ఆక్రమణలు తొలగించి లే అవుట్ వేశారు. అక్కడ 55 మందికి ఇళ్లు మంజూరు కాగా 45 మంది నిర్మాణాలు పూర్తి చేసి నివాసం ఉంటున్నారు. అయితే రహదారిని అభివృద్ధి చేయకపోవడం, మురుగు కాలువలు నిర్మించకపోవడంతో వర్షాలు పడినప్పుడు నానా అవస్థలు పడుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు.

* శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రుని వలసలో 200 ఇళ్లతో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో 15 కుటుంబాలే నివాసం ఉంటున్నాయి. ఈ కాలనీకి కూడా కాలువలు, రోడ్లు లేవు.

* శ్రీకాకుళం రూరల్ మండలం వాకలవలస జగనన్న కాలనీలో 1780 మందికి ఇళ్లు కేటాయించగా కేవలం వంద కుటుంబాలే నివాసం ఉంటున్నాయి. మరో వంద కుటుంబాలు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహప్రవేశాలకు సిద్ధమైనా వర్షాలకు కాలనీ అంతా జలమయం కావడంతో వెనుకంజ వేశారు.

### దూరాభారంతో అమ్మకాలు

లబ్ధిదారులను మరో కీలక సమస్య ఇబ్బంది పెడుతోంది. జిల్లాలోని మెజారిటీ కాలనీలను కొండలు, గుట్టలు, లోతట్టు ప్రాంతాల్లో కాలనీ లే అవుట్లు వేశారు. దాదాపు అవన్నీ జనావాసాలకు, ఊళ్లకు దూరంగా ఉన్నాయి. అదే సమయంలో ఇళ్లు మంజూరైన వారిలో అధికశాతం పేద వర్గాలకు చెందినవారే. ఊళ్లలో చిన్నాచితకా పనులు చేసుకుని పొట్టపోసుకునేవారే. ఇప్పుడు వారందరూ ఊరికి దూరంగా ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లలోకి వెళితే ఉపాధి కోల్పోయే ప్రమాదముంది. ఉపాధి కోసం రోజూ ఆ కాలనీల నుంచి ఊళ్లలోకి రావాలంటే దూరాభారం, ఖర్చులతో కూడుకున్నది కావడంతో ఉపాధి వదులుకుని ఆ ఇళ్లలో చేరేందుకు చాలామంది లబ్ధిదారులు ఇష్టపడటం లేదు. అదే సమయంలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నిర్దేశించి యూనిట్ కాస్ట్ ఏ మాత్రం సరిపోవడంలేదు. అలాగే సబ్సిడీ పోను మిగతా మొత్తాన్ని నెలవారీ వాయిదాల్లో చెల్లించడం కూడా భారమేనని లబ్ధిదారులు భావిస్తున్నారు. దాంతో చాలామంది జగనన్న ఇళ్లను అమ్మేసుకుంటున్నారు. సగం నిర్మించి వదిలేసిన ఇళ్లను, తమకు కేటాయించిన స్థలాలను రూ.2 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు బేరం పెట్టి అమ్మేస్తున్నారు. శ్రీకాకుళం నగరానికి సమీపంలో ఉన్న ఎచ్చెర్ల మండలం కుశాలపురం పారిశ్రామిక వాడ వెనుక 80 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయగా అక్కడ చాలామంది మధ్యవర్తుల ద్వారా వాటిని విక్రయించేస్తున్నారు. కాగా అర్హతలు లేకపోయినా పరపతితో, బోగస్ పత్రాలతో ఇళ్లు పొందినవారిలో ఎక్కువమంది వాటిని అమ్మేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది. కుశాలపురంలోనే కాకుండా జిల్లాలోని దాదాపు అన్ని కాలనీల్లోనూ విక్రయాలు కొనసాగుతున్నాయి. దళారులు ఇదే పనిలో నిమగ్నమై కమీషన్ల రూపంలో పెద్ద ఎత్తున సంపాదించుకుంటున్నారు. ఎన్నికల్లో వైకాపా ఓడిపోయి ఎన్డీయే కూటమి ప్రభుత్వంలోకి రావడంతో అసంపూర్తిగా ఉన్న జగనన్న కాలనీల పరిస్థితి డోలాయమానంలో పడింది. లబ్ధిదారులు ఇళ్లు అమ్మేసుకుంటున్నారన్న ఫిర్యాదులు సైతం ప్రభుత్వానికి అందుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# యాంత్రీకరణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి అన్నారు. రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానంలో వ్యవసాయ యాంత్రీకరణ మేళాను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేళాలోని యంత్రపరికరాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యేలు శంకర్, రమణమూర్తి పరిశీలించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రైతులు మారుతున్న సాంకేతికీకరణలో భాగంగా వ్యవసాయ రంగంలో యంత్రాల వినియోగాన్ని, వాటిపై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ రైతులు యంత్రసేద్యం దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో యాంత్రీకరణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ రాయితీతో కూడిన సబ్సిడీ సాగు యంత్రాలు, వ్యవసాయ పనిముట్లు రైతులకు అందిస్తున్నామన్నారు. ఆప్కాబ్, డిసిసిబి ద్వారా యంత్ర పరికరాలను రైతులకు తక్కువ వడ్డీకే అందిస్తోందని తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో వ్యవసాయం పూర్తిగా దెబ్బతిని రైతులు కుటుంబాలతో సహా ఆర్థిక ఇబ్బందులతో చితికిపోయారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంట విత్తనం మొదలు పంటల విక్రయం వరకు ప్రభుత్వం అనుసంధానంగా వ్యవహరిస్తూ రైతులకు అనేక సూచనలు ఇస్తూ పంట ఇన్సూరెన్స్, గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపడుతోందన్నారు. ఈ యంత్ర పరికరాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్ర సందర్శన అనంతరం వ్యవసాయ యాంత్రీకరణ ప్రదర్శన, వ్యవసాయ క్విజ్, రైతు సదస్సు, వ్యవసాయ ప్రచురణల విడుదల, రైతులతో శాస్త్రవేత్తల చర్చాగోష్టి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ, వ్యవసాయాధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆడించేది.. దాడులు చేసేది వారే!

(మొదటిపేజీ తరువాయి)

విషయాన్ని ఎస్పీకి లీక్ చేసింది పోలీసులే. అదే సమయంలో రైడ్ చేయడానికి సీఐ వస్తున్నారని నిర్వాహకులకు ఇన్ఫర్మేషన్ ఇచ్చింది కూడా పోలీసులేనన్న అనుమానాలున్నాయి. పేకాడుతూ పట్టుబడిన విషయాన్ని పెద్దది చేస్తే పెద్ద ఎత్తున స్టేషన్ మామూళ్లు ఫిక్స్ చేయొచ్చనేది జిల్లాలో తలపండిపోయిన కొందరు రైటర్ల ఆలోచన. అందులో భాగంగానే రైడ్లు, లీకులు జరిగాయని తెలుస్తుంది. ముఖ్యంగా గతంలో జిల్లా ఎస్పీగా ఒకరు బాధ్యతలు చేపట్టిన తర్వాత పేకాట శిబిరాల నిర్వాహకులతో అంటకాగుతూ మంత్లీలు దండుకున్నట్టు పోలీసు వర్గాల్లోనే చర్చ జరిగింది. జిల్లాలోని అన్ని సర్కిల్స్ పరిధిలో పేకాట నిర్వాహకుల నుంచి మంత్లీలు వసూలు చేసి ప్రతి నెలా నేర సమీక్ష సమావేశానికి ముందు రోజు తెచ్చి సమర్పించేవారని భోగట్టా. ఆ పోలీస్‌బాస్ బదిలీపై వెళ్లిపోయిన తర్వాత మంత్లీల వాటాల్లో తేడాలు వచ్చాయని, దాని ఫలితంగా ఎచ్చెర్ల పరిధిలో మంగళవారం రాత్రి ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి కొందరు ప్రముఖులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారని చర్చ జరుగుతోంది.

**పోలీసులకు తెలిసే ఎప్పటినుంచో..**

జిల్లాలో అనేక గెస్ట్‌హౌస్‌లలో ప్రముఖులు చతుర్ముఖ పారాయణం నిర్వహించడం కొత్తకాదు. ఎప్పటినుంచో జరుగుతున్న ఈ దందా గురించి పోలీసులకు తెలిసినా ప్రతినెలా మామూళ్లు దండుకుంటూ వారి జోలికి వెళ్లకుండా మౌనం వహిస్తూ వచ్చారు. ఈ పేకాట డెన్ వెనుక పోలీసు పెద్దల హస్తం ఉందని ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. పేకాట కోసమే విదేశాలకు వెళ్లే ప్రముఖులుగా గుర్తింపు ఉన్న ఆర్.కే.నాయుడు, విజయగనరంలో ఒక బట్టల దుకాణం అధినేత, విజయనగరానికే చెందిన ఒక మాజీ ఎమ్మెల్సీ తదితరులు ఈ గెస్ట్‌హౌస్‌లో జరిగే పేకాటలో పాల్గొంటుంటారు. ఈ సమాచారం అందుకున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి టాస్క్‌ఫోర్స్ ద్వారా రైడ్ చేయించి పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. అయితే ఎస్పీ దాడి ప్రణాళికను పోలీసులే లీక్ చేసి పేకాట ఆడుతున్నవారికి ఉప్పు అందించినట్లు తెలిసింది. గెస్ట్‌హౌస్ యజమానికే రైడ్ జరగనున్న సమాచారాన్ని ముందుగా పోలీసులు చేరవేశారట. ఇదంతా పోలీసులు మామూళ్ల కోసం నిత్యం చేసే పనేనని ఆయన పట్టించుకోపోవడంతో ఆ తర్వాత పేకాట నిర్వహిస్తున్న అంధవరపు శ్రీనుకు ఫోన్ చేసి చెప్పడానికి ప్రయత్నించగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదని తెలిసింది. దాంతో ఒక ప్రముఖ లాయర్‌కు ఫోన్ చేయగా ఆయన కూడా ఏమీ కాదులే.. అని చెప్పి ఫోన్ పెట్టేసినట్లు తెలిసింది. అనంతరం మరో ఇద్దరు ప్రముఖులకు ఫోన్ కాల్స్ వెళ్లగా వారు టాయిలెట్ పేరుతో అక్కడ నుంచి జారుకున్నారని అంటున్నారు.

**మంత్లీలు అందకపోవడమే కారణమా?**

దాడి సమాచారాన్ని లీక్ చేసినవారు, దాడికి కారకులు కూడా పోలీసులే కావడం ఈ కేసులో విశేషం. దీనివెనుక పెద్ద తతంగమే ఉంది. గతంలో ఒక ఎస్పీ ఉన్నప్పుడు కూడా అనేక మంది పెద్దలకు చెందిన గెస్ట్‌హౌస్‌ల్లో తరచూ పేకాట ఆడించేవారు. అందుకుగాను ప్రతినెలా రూ.10 లక్షలు మంత్లీల రూపంలో సమర్పించేవారు. దీంతో పాటు ఎచ్చెర్ల పోలీసులకు మంత్లీలు ముట్టజెప్పేవారు. మంగళవారం రాత్రి జరిపిన రైడ్‌లో పేకాడుతున్నవారి కార్లను వదిలేసి రూ.8లక్షలకు పైగా నగదు, సెల్‌ఫోన్లను మాత్రమే స్వాధీనం చేసుకున్నారని భోగట్టా. అయితే రూ.3.25 లక్షలు మాత్రమే అక్కడ దొరికినట్లు చూపించారని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. పోలీసులకు పేకాట శిబిరాల నిర్వాహకులు, గెస్ట్‌హౌస్ యజమానులు, జిల్లాలో కొందరు పెద్దలు కేవలం పేకాట కోసమే సొమ్ములు ఇవ్వడం ఇక్కడ ఎప్పట్నుంచో జరుగుతున్న వ్యవహారం. ఆరేళ్ల ముందు ఇక్కడ ఎస్పీగా పనిచేసిన ఒక రెడ్డి పేకాట, బెట్టింగ్ నిర్వాహకులను పిలిచి అండర్‌వేర్‌తో కూర్చోబెట్టి మరీ మంత్లీలు వసూలుచేసి ఇచ్చే బాధ్యతను అప్పగించారు. అప్పట్నుంచి జిల్లాలో పేకాడటానికి అనువైన వాతావరణం ఏర్పడింది. పోలీస్ బాస్‌లు ఎంతమంది మారినా పేకాట శిబిరాలు తగ్గలేదు కదా.. మరింత పెరిగాయి. జిల్లాలో ఉన్న ప్రతీ రిసార్టు, గెస్ట్‌హౌస్ పేకాట కేంద్రాలే. ఇవన్నీ పోలీసుల కనుసన్నల్లోనే నడుస్తుంటాయి.



జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహించిన ఖోఖో, వాలీబాల్, 100 మీటర్స్ వాకింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విజేతలకు జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

# గిడుగు ఆశయాన్ని నెరవేరుస్తాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగు భాష పునరుజ్జీవమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మాతృభాష దినోత్సవంతో పాటు తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో గిడుగు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి తమ ప్రభుత్వమే గతంలో కూడా ఎంతో కృషి చేసిందన్నారు. తెలుగుని వ్యవహారిక భాషగా మలిచేందుకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి అనిర్వచనీయమైనదని కొనియాడారు. పర్వతాలపేటలో జన్మించిన గిడుగు ప్రపంచమంతా గర్వించే తెలుగు భాషకు చేసిన సేవకు గుర్తుగా ప్రభుత్వమే అధికారికంగా గిడుగు జయంతి కార్యక్రమం నిర్వహించాలని ఎమ్మెల్యే అన్నారు. తెలుగు భాష గొప్పతనం కోసం గిడుగు చేసిన సేవలను కొనియాడుతూ అవధాన పండితులు పైడి హరినాధరావు, నిష్టల నరసింహమూర్తి గేయాలు ఆలపించారు. గిడుగు విగ్రహ దాత మందపల్లి రామకృష్ణారావును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు డాక్టర్ జామి భీమశంకర్, నటుకుల మోహన్, మెట్ట అనంతం బట్లు, పందిరి అప్పారావు, సువ్వారి రాజారావు, శాస్త్రీ తదితరులు ఉన్నారు.



# తెలుగు ఔన్నత్యాన్ని చాటండి

(సత్యంన్యూస్, నరసన్నపేట)

తెలుగు ఔన్నత్యాన్ని చాటి చెప్పి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, భాష, కళలను ప్రతిబింబించేలా వ్యవహరించాలని పద్మావతి డిగ్రీ కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ అభిప్రాయపడ్డారు. గురువారం గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా కళాశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి ఎనలేని కృషి చేశారన్నారు. తెలుగు ప్రజలు పరభాషా మోజుతో సంస్కృతిని మర్చిపోతున్నారని, ప్రాముఖ్యతను విద్యార్థులు గుర్తెరిగి ఇంగ్లిష్‌తోపాటు తెలుగుభాషను మరవకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల తెలుగు అధ్యాపకులు లక్కోజు గౌరీశంకర్ మాట్లాడుతూ తెలుగు భాష ఉనికికి విఘాతం కల్గిస్తున్న పరిస్థితులను సభికులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి మూకల్ల శ్రీనివాసరావు, అధ్యాపకులు పద్మనాభం, కె.రాము, రమణలు పాల్గొన్నారు.




# ఎలుకలను పట్టుకునేందుకు ఏర్పాట్లు చేసాం


**- పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జయరాజు**

(సత్యంన్యూస్, నరసన్నపేట)

తామరాపల్లి సమీపంలోని బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్సియల్ కళాశాలలో ఎలుకలు కరవడంతో ఐదుగురు విద్యార్థినులు గాయపడిన సంఘటనపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆరా తీశారు. తక్షణమే ఎలుకలను నివారించాలంటూ పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయరాజును ఆదేశించారు. ఆయన తన సిబ్బందితో బుధవారం హాస్టల్‌కు చేరుకొని ఎలుకల మందు (రొడెంటిసైట్)ను, అక్కడక్కడ ఎలుకలను పట్టుకునేందుకు బోనులను ఏర్పాటుచేశారు. కళాశాలలో వీటి సంచారం ఎక్కువగా ఉండటం, రాత్రివేళలో ఎక్కువగా రావడంతో అక్కడ పారిశుధ్య నిర్వహణపై ఇప్పటికే తగు ఆదేశాలు జారీ చేశారు. ఎలుకలు కరవడంతో ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స తీసుకున్నవారి ఆరోగ్య పరిస్థితిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.




# రూ.40 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.40కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఖేలో ఇండియా పథకంలో భాగంగా పాత్రునివలసలో కేంద్ర ప్రభుత్వ నిధులతో దీని నిర్మాణం పూర్తి చేసి రెండేళ్లలో క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శాంతినగర్ కాలనీలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్‌కు దేశం మొత్తం ప్రతి ఏటా ఇచ్చే గొప్ప నివాళిగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. చదువుతో పాటు క్రీడలను సమన్వయం చేసుకున్నవారు జీవితంలో అత్యున్నత స్థానాలకు చేరుకుంటారని చెప్పారు. కోడి రామకృష్ణ స్టేడియం చుట్టూ ప్రేక్షకుల గ్యాలరీ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ కోడి రామకృష్ణమూర్తి స్టేడియం నిర్మాణాన్ని త్వరలోనే పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ప్రతివారం పనుల పురోగతిని తాను స్వయంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. వివిధ క్రీడాంశాలలో విజయం సాధించిన వారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్, ఎమ్మెల్యే కలిసి పలువురు క్రీడాకారులను శాలువ, మెమొంటో, ధ్రువీకరణ పత్రాలతో సత్కరించారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు ఏడు రోడ్ల కూడలి నుంచి శాంతినగర్ కాలనీ ఇండోర్ స్టేడియం వరకు క్రీడాకారులు 2కే ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో కే.శ్రీధర్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు, ఒలింపిక్ అసోసియేషన్ సలహాదారు సుందరరావు మాస్టారు, కోచ్‌లు మాధురి, మణికంఠ, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో సంబరాలు అంబరాన్నంటేలా జరిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సీహెచ్ దేవదత్తానంద్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతిఒక్కరు తెలుగు భాషలో మాట్లాడటం, రాయడం చేయాలన్నారు. అలాగే క్రీడలకు ప్రాధాన్యత నిచ్చి జాతీయస్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల తెలుగు పండితులు చాద శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు టేకు పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అభినందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజైన సెప్టెంబరు 5న జాతీయ స్థాయిలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించడానికి ఎంపికైన 50 మంది ఉపాధ్యాయులను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సంఘం జాతీయ అధ్యక్షుడు చౌధరి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమ్మన పురుషోత్తం, ఉపాధ్యక్షులు డిఏ స్టాలిన్, కార్యదర్శి పారశెల్లి రామరాజు, కోశాధికారి కొప్పల సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కుదుమ తిరుమలరావు అభినందించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన వీరికి సెప్టెంబర్ 5న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ధ్రువపత్రం, రూ.50వేల నగదు పురస్కారంతో పాటు వెండి పూత పూసిన మెడల్ బహూకరిస్తారు. 4న వీరిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసంలో అల్పాహారం ఏర్పాటు చేసి వీరితో ముచ్చటిస్తారు. తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ నుంచి మిద్దె శ్రీనివాసరావు (కృష్ణా జిల్లా), కుణతి సురేష్ (చిత్తూరు జిల్లా) తెలంగాణ నుంచి పేసర ప్రభాకర రెడ్డి (ఖమ్మం జిల్లా), తాడూరి సంపత్ కుమార్ (సిరిసిల్ల రాజన్న జిల్లా) ఎంపికైనట్లు వీరు తెలిపారు.




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.